గురువారం
19 -02- 2026
విజయనగరం : ప్రచురణ
సంపుటి : 02 సంచిక : 334
పేజిలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by :
Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari,Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com
స్థాపితం : 2008
RNI No. APTEL/2008/24928
Postal Registration No. : VZM/22/2020-2022
Period of Renewal. : 01-01-2023 to 31-12-2025

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

న్యూస్ పేపర్స్ యాజమాన్యానికి శుభవార్త


అతి తక్కువ ధరలకే బ్లాక్ అండ్ వైట్, మల్టీకలర్ దినపత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు మరియు మాస పత్రికలు ప్రింటింగ్ చేయబడును
ఇట్లు
ప్రజాస్వామ్యం తెలుగు దినపత్రిక ప్రింటింగ్ యూనిట్
Cell : 93470 64455

## విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టు వీక్షించే అవకాశం



అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరుగుతున్న చర్చలను ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిచ్చిన స్పీకర్ అయ్యన్న

ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని యువతకు పిలుపు

అమరావతి : అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులకు త్వరలో పోలవరం ప్రాజెక్టును కూడా వీక్షించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. మిగతా..2లో

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు

రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం

ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం

42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్: తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం. ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ మిగతా..2లో

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం...

### ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి



- రసాయనాలతో నెయ్యి తయారు చేశారని సిట్ రిపోర్ట్ ఇచ్చిందన్న అనిత
- పింక్ డైమండ్ పేరుతో గతంలో సభా సమయం వృథా చేశారని మండిపాటు
- సాక్షిలో రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని ఎద్దేవా

అమరావతి : తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు.

## విశాఖ తీరంలో ఫ్లీట్ రివ్యూ యుద్ధనౌకల పరేడ్‌ను

# తిలకించిన రాష్ట్రపతి ముర్ము

- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము
- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలు, ఆరు వరుసల్లో 71 యుద్ధనౌకల పరేడ్



అమరావతి : విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష ప్రారంభమైంది. ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశేష అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, తూర్పు నౌకా దళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాలు పాల్గొన్నారు. నేవీ సిబ్బంది గౌరవ వందనాన్ని రాష్ట్రపతి ముర్ము స్వీకరించారు. మిగతా..2లో

## మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై

# వైఎస్ షర్మిల తీవ్ర విచారం

- గంజాయి మత్తులోనే ఈ దారుణం జరిగిందని ఆరోపణ
- డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలని సీఎం చంద్రబాబుకు డిమాండ్
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి



అమరావతి : మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకో వడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు.

## రాజ్యాంగాన్ని కచ్చితంగా మార్చాల్సిందే

# కేంద్రంపై సీఎం స్టాలిన్ ఫైర్



- రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కల్పించేలా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణను అవసరమని చెప్పిన సీఎం స్టాలిన్

ఢిల్లీ : భారత రాజ్యాంగాన్ని సవరించాలంటూ డిమాండ్ చేశారు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కల్పించేలా సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగ సవరణను అవసరమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నిర్మాణాత్మక పునర్ నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని ఆరోపించారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ నివేదిక

## ఏఐ సమ్మిట్ లో చైనా రోబో

# మోదీ సర్కార్ భారత్ పరువు తీసింది

- మేక్ ఇన్ ఇండియా అని చెప్పి చైనా రోబోలను ప్రదర్శిస్తారా
- మోదీ ప్రభుత్వం దేశ పరువు తీసింది
- అంతర్జాతీయంగా నవ్వులపాలయ్యామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం




అమరావతి : ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సదస్సులో చైనాకు చెందిన రోబోలను భారతీయ ఆవిష్కరణలుగా ప్రదర్శించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సును ఆయన 'పబ్లిసిటీ స్టంట్'గా అభివర్ణించారు. భారతీయ ప్రతిభను, డేటాను వినియోగించుకోవాల్సింది పోయి, చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తూ, భారతీయ డేటాను అమ్మకానికి పెట్టారని ఆయన మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ సదస్సులో గల్గోటియాస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. గల్గోటియాస్ యూనివర్సిటీ తమ స్టాల్‌లో ఒక రోబోటిక్ కుక్కను ప్రదర్శించింది. దానికి 'ఓరియన్' అని పేరు పెట్టింది. అయితే, టెక్ నిపుణులు, విమర్శకులు అది భారతీయ ఆవిష్కరణ కాదని పసిగట్టారు. అది చైనాకు చెందిన 'యూనిట్రీ గో2' రోబో అని, దానిపై ఉన్న లేబుల్ మార్చి సొంత ఆవిష్కరణగా చెప్పుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మిగతా..2లో

## రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు

# ప్రోత్సాహకాలు ఇవ్వాలి

### సీఎంకు రైతు సంఘాల వినతి

- బ్యాచిలర్ రైతుల పెళ్లిళ్లకు ప్రత్యేక స్కీం- వారిని పెళ్లాడే యువతుల పేరిట రూ.10 లక్షల ఎఫ్‌డీ
- ప్రభుత్వ పూచీకత్తుతో వ్యాపార రుణాలు
- కర్ణాటక సీఎంకు రైతు సంఘాల వినతి



ఢిల్లీ : కర్ణాటకలోని రైతు సంఘాలు సరికొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చాయి. యువ రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించాలని అవి కోరుతున్నాయి. ప్రస్తుతం బ్యాచిలర్ రైతులు ఆర్థికపరమైన అస్థిరతను, అనిశ్చితిని ఎదుర్కొంటున్నందున, వారిని పెళ్లి చేసుకునే యువతులకు నగదు పారితోషికాలను ఇవ్వాలని రాష్ట్ర సర్కారుకు విన్నవిస్తున్నాయి. ఈ మేరకు ఒక విజ్ఞాపన పత్రాన్ని (మెమొరాండం) సీఎం సిద్ధరామయ్యకు రైతు సంఘాల నేతలు మంగళవారం రోజు (ఫిబ్రవరి 17న) అందజేశారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై చర్చించేందుకు రైతు సంఘాల నేతలతో బెంగళూరులోని విధాన సౌధలో సీఎం సిద్ధరామయ్య సమావేశమయ్యారు. ఆసందర్భంగానే సీఎంకు వినతిపత్రాన్ని ఇచ్చామని రైతు నేతలు వెల్లడించారు. ప్రస్తుతం మిగతా..2లో

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది



- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను

# అందజేస్తాం

హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు.

1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. సచివాలయంలో హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ౹౹1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు. కింద హైదరాబాద్ నుంచి 4.22 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. భాగ్యనగరంలో స్థలాల సేకరణతో ++5 నుంచి ++10 వరకు ఇళ్ల నిర్మాణ ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుపై మంత్రులు సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా అందజేస్తామని.. నిజమైన లబ్ధిదారుల ఎంపికే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## రోడ్ల అభివృద్ధికి పారదర్శకంగా నిధులను

# వినియోగించాలి

- తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : రోడ్లు, భవనాల శాఖ 2026- 27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బీవీ రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు, పలువురు ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు. గత ఏడాది బడ్జెట్, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## మదనపల్లిలో బాలికపై జరిగిన అఘాయిత్యంపై వైఎస్ షర్మిల తీవ్ర విచారం

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం... ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి

చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు. దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్ రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని అనిత దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో యాడ్స్ రూపంలో సాక్షికి రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది

హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

## రోడ్ల అభివృద్ధికి పారదర్శకంగా నిధులను వినియోగించాలి

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖది కీలక పాత్ర..

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2047 రైజింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి.. అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు.

కేంద్ర మంత్రులను కలుస్తా..

ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశామని.. అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్ - విజయవాడ (చీస 65) 8వ లైన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి కోరతామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు ఇదని... ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం సహకారం అందించే ఆయా ప్రాజెక్టుల్లో వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తో మోదీ భేటీ

గూగుల్ తో కలిసి భారత విద్యార్థులు, నిపుణులు కలిసి పనిచేసే అవకాశం- భేటీలో దీనిపైనే ప్రధానంగా చర్చ!

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పలువురు ప్రపంచ దేశాధినేతలు, పారిశ్రామిక దిగ్గజాలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ముఖ్యంగా గూగుల్ సీఈఓ గూగుల్, దాని మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఇంక్ సీఈఓ సుందర్ పిచాయ్ తో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే భారతీయ విద్యార్థులు, నిపుణులతో కలిసి గూగుల్ ఈ ఏఐ రంగంలో ఎలా ముందుకు సాగవచ్చనే అంశంపై ఆయనతో చర్చించారు. ఈ భేటీ తరువాత ప్రధాని మోదీ ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు.

"ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ను కలవడం సంతోషంగా ఉంది. ఏఐ రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే మన ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులు గూగుల్ తో కలిసి పనిచేసే అవకాశాల గురించి చర్చించాం."

– ప్రధాని మోదీ

ఫిన్లాండ్ ప్రధానితో చర్చలు అలాగే ప్రధాని మోదీ, ఫిన్లాండ్ ప్రధాని పెటెరి ఒర్పొతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్ -ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్ టీఏ) మద్దతు ఇస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం భారత్ -ఈయూ సంబంధాల్లో ఒక స్వర్ణయుగాన్ని ప్రారంభిస్తుందని మోదీ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రానున్న కాలంలో భారత్ , ఫిన్లాండ్ ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతోపాటు, 6జీ టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, బయో ఫ్యూయెల్స్ లాంటి భవిష్యత్ టెక్నాలజీల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు.

స్పెయిన్ అధ్యక్షుడితో మోదీ భేటీ స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరుదేశాలు రక్షణ, భద్రత, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరాన్ని భారత్ -స్పెయిన్ సంస్కృతి, పర్యాట, ఏఐ ఏడాదిగా జరుగుకుంటున్నట్లు ప్రదాని మోదీ ప్రకటించారు. ఇది ఇరుదేశాల ప్రజల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. స్పెయిన్ నుంచి పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయ ప్రతినిధులు భారత్ కు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారత్ ఐటీ రంగానికి ఊతం ఢిల్లీని భారత్ మండపంలో ఫిబ్రవరి 16న మొదలైన ఈ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఫిబ్రవరి 20 వరకు కొనసాగనుంది. గ్లోబల్ సౌత్ (ఆర్థికంగా వెనుకబడిన దేశాలు)లో నిర్వహిస్తున్న మొదటి అంతర్జాతీయ ఏఐ సదస్సు ఇదే కావడం గమనార్హం. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ', 'మానవాళి కోసం ఏఐ' అనే నినాదంతో, 'పీపుల్ , ప్లానెట్ , ప్రోగ్రెస్ ' అనే మూడు సూత్రాలతో భారత్ దీనిని నిర్వహిస్తోంది. కు స్వయంగా వచ్చి పర్యవేక్షించారు. ఈ ఎక్స్ పోలో 600కిపైగా స్టార్టప్ లు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. అంతేకాదు ఏఐ వ్యవస్థలో అంతర్జాతీయ సహకారాన్ని చాటిచెప్పేలా 13 దేశాల పెవిలియన్లు

# విశాఖ తీరంలో ఫ్లీట్ రివ్యూ యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము

మొదటి పేజి తరువాయి

అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రయాణించారు. విశేషం ఏంటంటే ఈ కార్యక్రమంలో రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల నుంచి వచ్చినటువంటి మొత్తం 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఆర్కేబీచ్ ప్రధాన కేంద్రంగా సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిబంధనలు తప్పనిసరి: విశాఖ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అధికారులు అవకాశాన్ని కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. పలు బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరిగా ఉండి తీరాలి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించేందుకు విశాఖ సాగర తీరానికి స్థానికులు పోటెత్తారు. నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన ముర్ము: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు, పరస్పర సహకారానికి అద్దం పట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష -2026లో పాల్గొన్న రాష్ట్రపతి భారత నౌకాదళం ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తుందని రాష్ట్రపతి ముర్ము కితాబిచ్చారు. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా నిర్వహించిన 71 యుద్ధనౌకల పరేడ్‌ను రాష్ట్రపతి

# విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టు వీక్షించే అవకాశం

మొదటి పేజి తరువాయి

ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయాలంటే నాయకత్వం స్వీకరించాలని సూచించారు. దాదాపు 300 మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు సభా గ్యాలరీల్లో కూర్చొని ప్రజా సమస్యలపై జరుగుతున్న చర్చలు, చట్టాల రూపకల్పన ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించారు. 6 రోజులుగా కొనసాగుతున్న ఈ విజ్ఞాన యాత్రలో ఇప్పటికే దాదాపు 1400 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు. సభ విరామ సమయంలో స్పీకర్ స్వయంగా విద్యార్థుల వద్దకు వెళ్లి వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్రను స్పీకర్ వివరించడం వారికి ప్రత్యేక ప్రేరణగా నిలిచింది. అసెంబ్లీని సందర్శించిన 1400 మంది విద్యార్థులు: భావి భారత పౌరులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏపీ శాసనసభ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ రోజు 300 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించి సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు.



గత 6 రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 1400 మంది విద్యార్థులు భాగమయ్యారు. ప్రజా సమస్యలపై చర్చలు, చట్టాల రూపకల్పన విధానం, బడ్జెట్ ఆమోద ప్రక్రియ వంటి అంశాలను వారు ఆసక్తిగా గమనించారు. మేము ఇక్కడకు వచ్చేటప్పుడు ఇది రాజకీయ దేవాలయం అని చెప్పారు. కాని మాకు ఇక్కడకు వచ్చాక తెలిసింది. ఇంతమంది నేతలు ప్రజల సమస్యలు, ఆశయాల గురించి మాట్లాడటం చూసి చాలా ఆనందంగా అనిపించింది. ముఖ్యంగా విద్యాశాఖ గురించి మాట్లాడేటప్పుడు 33,800 కోట్లు దీనికి కేటాయించారు అని తెలియజేశారు. ఇలానే వ్యవసాయం గురించి చాలా వరకు మాట్లాడారు. అలానే మా శ్రీకాకుళం నుంచి ఇంతమంది నేతలను ఇక్కడ చూడటం చాలా ఆనందంగా ఉంది.- విద్యార్థిని విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమైన నేతలు: కాగా నిన్నటి రోజున సభా విరామ సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పత్తిపాటి పుల్లారావు, బొండా ఉమామహేశ్వరరావు విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఉన్నత లక్ష్యాలతో చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడి తో విద్యార్థులు ఫొటోలు దిగారు. చట్టసభ వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూడటం తమకు స్ఫూర్తినిచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి

మొదటి పేజి తరువాయి

రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాన్ని చూపాలని సీఎంను కోరామన్నారు.

### ఆ డిమాండ్లు నెరవేర్చాల్సిందే!

ప్రస్తుతం యువ రైతులకు పెళ్లి సంబంధాలు కుదరడం లేదని, ఈ సామాజిక సమస్య వల్ల వారి తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారని రైతు సంఘాల నేతలు తెలిపారు. యువ రైతుల పెళ్లికి చేయూతను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తేవాలని సీఎం సిద్ధరామయ్యను కోరామన్నారు. ఆ పథకం ద్వారా బ్యాచిలర్ రైతులను పెళ్లి చేసుకునే మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 లక్షలు చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని విన్నవించామని పేర్కొన్నారు. యువ రైతులను పెళ్లి చేసుకునే మహిళలు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలను చేసుకునేందుకు ప్రభుత్వ పూచీకత్తుతో వడ్డీలేని రుణాలను ఇవ్వాలని సీఎంను కోరామని రైతు సంఘాల నేతలు వివరించారు. బ్యాచిలర్ రైతులను పెళ్లి చేసుకునే మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్‌ను కూడా సీఎం సిద్ధరామయ్య ఎదుట ప్రస్తావించామన్నారు. గోవధపై తెచ్చిన చట్టాన్ని రద్దు చేయండి రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని కర్ణాటక సీఎంను రైతు సంఘాల నేతలు కోరారు. రైతుల జీవితాలను మార్చే దీర్ఘకాలిక వ్యూహం కలిగిన పథకాలను అమల్లోకి తేవాలన్నారు. గతంలో భూసంస్కరణల చట్టానికి చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని రైతులు కోరారు. రైతులకు మరింత చేరువ అయ్యేలా అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) చట్టాన్ని బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ ధరల కమిషన్‌కు చట్టబద్ధమైన అధికారాలను మంజూరు చేయాలని, తద్వారా పంటల ధరలపై అది చేసే సిఫార్సులు అధికారికంగా అమల్లోకి వస్తాయని రైతు సంఘాలు పేర్కొన్నాయి. ప్రొఫెసర్ ఎండీ నంజుండస్వామి జన్మించిన మైసూరు జిల్లాలోని మాదేహళ్లి గ్రామాన్ని డెవలప్ చేయడానికి ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని కోరాయి.

కేంద్రం చట్టాలను కర్ణాటకలో అమలు చేయొద్దు

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2025, సీడ్స్ బిల్ 2025, నేషనల్ ఫ్రేమ్ వర్క్ పాలసీ ఆన్ అగ్రికల్చరల్ మార్కెటింగ్‌లను కర్ణాటకలో అమలు చేసేది లేదని అసెంబ్లీలో ప్రకటించాలని సీఎంను రైతు సంఘాలు కోరాయి. రైతుల పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను అందించేందుకు రూ.20వేల కోట్లతో రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి. రైతుల నుంచి నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో వరి, రాగులు, జొన్నలు, కందిపప్పు, నూనె గింజలు, మిల్లెట్లను కొనాలని విజ్ఞప్తి చేశాయి.

ఆ రైతులకు భూములపై హక్కులివ్వండి

అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో పంటలు పండిస్తున్న బగార్ హుకుమ్ రైతులకు ఆయా భూములపై హక్కులను మంజూరు చేయాలని సీఎం సిద్ధరామయ్యను రైతు సంఘాల నేతలు కోరారు. పంట బీమా పథకం కవరేజీని అన్ని పంటలకు విస్తరించాలన్నారు. అధిక వర్షపాతం, కరవు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయే రైతులకు తప్పకుండా పంట బీమా పథకం ద్వారా పరిహారం అందేలా చూడాలని సీఎంకు విన్నవించారు. ఈ డిమాండ్లు అన్నీ సీఎంకు తాము అందించిన వినతిపత్రంలో ఉన్నాయని రైతు సంఘాల నేతలు తెలిపారు.

రైతు ఆత్మహత్యల్లో నంబర్ 2 స్థానంలో కర్ణాటక

"కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చెరుకు పంట ధరను 1 టన్నుకు రూ.100 మేర పెంచింది. దీంతో ఒక టన్ను చెరుకు ధర రూ.3,300కు చేరింది. కానీ రైతుల నుంచి చెరుకు పంటను కొనే సమయంలో అంతరేటును చెల్లించడం లేదు. దీనిపై అధ్యయనానికి ఒక సాంకేతిక కమిటీని నియమించాలి. ఇప్పటికీ రైతుల ఆత్మహత్యల విషయంలో దేశంలో నంబర్ 2 స్థానంలో కర్ణాటక ఉంది. రైతుల ఆత్మహత్యలు ఆపేలా తక్షణ చర్యలను చేపట్టాలి" అని రైతు సంఘం నేత కురుబూరు శాంతాకుమార్ కోరారు.

సీఎం ఎదుట 25 అంశాలను లేవనెత్తాం

"సీఎం సిద్ధరామయ్యతో భేటీ సందర్భంగా మేం దాదాపు 20 నుంచి 25 అంశాలను లేవనెత్తాం. మైనర్ ఇరిగేషన్ అంశానికి ప్రభుత్వ ప్రాధాన్యతను పెంచాలని కోరాం. రైతులు కేంద్రంగా ఈసారి రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించాలని సూచించాం. మా విన్నపాలకు సీఎం సానుకూలంగా స్పందించారు" అని రైతు సంఘం నేత బడగలపుర నాగేంద్ర చెప్పారు.

# రాజ్యాంగాన్ని కచ్చితంగా మార్చాల్సిందే'- కేంద్రంపై సీఎం స్టాలిన్ ఫైర్

మొదటి పేజి తరువాయి

మొదటి భాగాన్ని తమిళనాడు అసెంబ్లీలో ప్రవేశపెడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చట్టప్రకారం రావాల్సిన నిధులను దక్కించుకునేందుకు కేంద్రంతో పోరాటం చేయాల్సిన పరిస్థితిలోకి తమిళనాడును నెట్టివేశారని విమర్శించారు. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలపై ఎలాంటి గౌరవం లేకుండా కేంద్రమే అన్ని అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. రాష్ట్రాలను గౌరవించకుండా కేంద్రమే అన్ని అధికారాలను తన వద్దే పెట్టుకుందని విమర్శించారు. "ఒక రాష్ట్రంగా మా ప్రజల కలలను నిజం చేసేందుకు మాకు అధికారాలు కూడా లేవు. సామాజిక న్యాయం, విద్య, వైద్యం, ఆర్థికం, మౌలిక సదుపాయల కల్పనలో చాలా అభివృద్ధి సాధించాం. కానీ నిధులు సహా కొన్ని హక్కుల కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను దక్కించుకునేందుకు ప్రతీసారి పోరాడాల్సిన పరిస్థితిల్లో మనం ఉన్నాం. ఇంకా ఎన్ని రోజులు వారు ఇస్తుంటే మనం తీసుకునే స్థితిలో ఉందాం? మేము ప్రతీ సారి తలవంచి అడుక్కునే వ్యక్తులం కాదు. మా రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి కావాలి. కేంద్రంలో సమాఖ్య వ్యవస్థ ఉంటేనే ప్రజలకు సుపరిపాలనను అందించగలం. భారత్ లాంటి వైవిధ్యం ఉన్న దేశానికి సమాఖ్య వ్యవస్థ పునాది లాంటిది. రాష్ట్రం- కేంద్రం మధ్య సంబంధాలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ అందించిన నివేదికను అసెంబ్లీలో పెడుతున్నాం. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని అందించేందుకు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని సవరించాలి. ఇప్పటికీ మనకు వచ్చే రాజ్యాంగ హక్కులు, నిధులు, అధికారాల కోసం పోరాడాల్సిన స్థితిలో ఉన్నాం. అందుకే భారతదేశ సమాఖ్య వ్యవస్థకు నిర్మాణాత్మక పునర్ నిర్మాణం అవసరం. మనం కోరుకుంటే, మళ్లీ రాజ్యాంగాన్ని సవరించవచ్చు. సమాఖ్యవాదం అంటే నియంత్రణ కాదు, నమ్మకం, స్వయంప్రతిపత్తి."

**ఎంకే స్టాలిన్ , తమిళనాడు ముఖ్యమంత్రి**

భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి కేంద్రం బలంగా ఉండాలని 1967లోనే డీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై అన్నారని సీఎం స్టాలిన్ గుర్తు చేశారు. ఆయన వారసుడు దివంగత ఎం కరుణానిధి కూడా 'రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి- కేంద్రంలో సమాఖ్యవాదం' అనే సూత్రం ద్వారా దీనికి మద్దతు తెలిపారని చెప్పారు. 1969లో జస్టిస్ పీవీ రాజమన్నార్ ఆధ్వర్యంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై మొదటి స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1983లో జస్టిస్ సర్కారియా నేతృత్వంలో కేంద్రం మరో కమిటీని ఏర్పాటు చేసింది. అనంతరం 2000లో వెంకటాచలయ్య కమిషన్ ను నియమించారు. కాగా, రాష్ట్రాల హక్కులపై గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా పోరాడుతున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 15న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీని నియమించారు. ఇందులో సభ్యులుగా ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి, విశ్రాంత ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, తమిళనాడు ప్రణాళికా సంఘం మాజీ వైస్ ఛైర్మన్ నాగనాథన్ ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఇందులోని మొదటి భాగాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

# ఏఐ సమ్మిట్ లో చైనా రోబో- మోదీ సర్కార్ భారత్ పరువు తీసింది

మొదటి పేజి తరువాయి

చైనా తయారు చేసిన రోబోను, ఇండియాలో తయారు చేసినట్లు చూపించడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.

### వర్సిటీకి ఉద్వాసన

వివాదం ముదరడంతో అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, గల్గోటియాస్ యూనివర్సిటీని వెంటనే ఎక్స్‌పో నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. వారి స్టాల్‌ను తక్షణమే ఖాళీ చేయించారు. చైనా రోబోను తమదిగా చెప్పుకోవడంపై ఆన్ లైన్, ఆఫ్ లైన్ వేదికల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### రాహుల్ గాంధీ ధ్వజం

ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "భారతదేశ ప్రతిభను, డేటాను వాడుకోవాల్సింది పోయి, ఏఐ సమ్మిట్‌ను ఒక పబ్లిసిటీ స్టంట్‌గా మార్చేశారు. ఇక్కడ భారతీయ డేటా అమ్మకానికి ఉంది. చైనా ఉత్పత్తులేమో ప్రదర్శనకు ఉన్నాయి" అని ఆయన ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ఏఐ విషయంలో భారత్‌ను ప్రపంచ దేశాల ముందు నవ్వులపాలు చేసిందని మండిపడ్డారు.

### కాంగ్రెస్ విమర్శల వర్షం

కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై అధికారికంగా స్పందించింది. "ఏఐ సమ్మిట్‌లో చైనా రోబోలను మనవిగా ప్రదర్శిస్తున్నారు. చైనా మీడియా మనల్ని చూసి ఎగతాళి చేస్తోంది. ఇది భారతదేశానికి నిజంగా అవమానకరం. ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఈ అబద్ధంలో భాగమయ్యారు. భారతీయ సదస్సులో చైనా రోబోలను ప్రమోట్ చేస్తున్నారు. దేశం ఇమేజ్‌కు మోదీ ప్రభుత్వం పూడ్చలేని నష్టం చేసింది. ఏఐ రంగాన్ని ఒక జోక్‌గా మార్చేశారు. మనకున్న డేటా శక్తితో మనం ప్రపంచానికి నాయకత్వం వహించాల్సింది పోయి, ఇలా దిగజారడం సిగ్గుచేటు" అని కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది.

### వర్సిటీ వివరణ ఇదే!

మరోవైపు గల్గోటియాస్ యూనివర్సిటీ ఈ ఆరోపణలను ఖండించింది. తమపై దుష్ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. "మా విద్యార్థులకు ఏఐ ప్రోగ్రామింగ్ నేర్పించడంలో భాగంగానే ఆ రోబోను ఉపయోగించాం. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న టూల్స్, వనరులను ఉపయోగించుకుని విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నాం. అంతేకానీ అది మా సొంత తయారీ అని చెప్పలేదు. విద్యార్థుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా ఇలాంటి ప్రచారం చేయడం తగదు" అని యూనివర్సిటీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇంతటి వివాదం నడుమనే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కొనసాగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారమే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026'ను ప్రారంభించారు. గురువారం ఆయన ఈ సదస్సులో ఉపన్యాసం చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. "పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్" (ప్రజలు, గ్రహం, ప్రగతి) అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ సదస్సు జరుగుతోంది. 20కి పైగా దేశాధినేతలు, 60 మంది మంత్రులు, 500 మంది గ్లోబల్ ఏఐ లీడర్లు ఇందులో పాల్గొంటున్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో జరుగుతున్న తొలి అంతర్జాతీయ ఏఐ సదస్సు ఇదే కావడం విశేషం.

# తవాస్మి హిందీ సంచికను ఆవిష్కరించిన తెలంగాణ గవర్నర్

ప్రజాస్వామ్యం,విజయనగరం తవాస్మి హిందీ సంచికను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , తెలంగాణ రాజ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తవాస్మిని నేటి యువతకు అత్యంత అవసం˘మైన విలువల ఆధారిత విద్యా కార్యక్రమంగా అభివర్ణిం చారు. ఈ విలువలు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యలో భాగం కావాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణతో తవాస్మి ఇప్పుడు ఇంగ్లీష్, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. రామాయణంలోని శాశ్వత విలువలను భావితరాలకు చేరవేయాలనే తవాస్మి ప్రయత్నంలో ఇది ఒక గొప్ప ముందడుగు. రామాయణంలోని జీవన విలువలను ప్రతి విద్యార్థికి, ప్రతి కుటుంబానికి, ప్రతి సమాజ ానికి చేరవేయాలనే ఈ యాత్రలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తవాస్మి బృందం ఆకాంక్షించింది. ఈ కార్యక్ర˘మం తవాస్మి ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలిచింది. ఈ సందర్భంగా తవాస్మి రచయిత శ్రీరామ చక్రధర్ గ్రంథాన్ని హిందీలోకి అనువదించిన స్వామి ఉరు క్రమా నంద కు భాషా సరళీకరణలో సహకరించిన పి. శివ ము నెమ్మ కు ,ఇంతటి బృహత్ గ్రంథం రూపుదిద్దడంలో సహకరించిన శారద దీప్తి, జాహ్నవి రెడ్డి, రితిక చక్రవర్తి తదితరులకు



కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బృందం రామనా రాయణం లో కూడా అనేక మంది విద్యార్థులకు రామాయణం లోని విలువలను వివిధ కార్యక్రమాలు ద్వారా అందించడం విశేషం.

# బాల్య వివాహాలు, టీనేజ్ గర్భాల నివారణపై 'జీరో టాలరెన్స్'

**ఐసీడీఎస్ సమావేశంలో కలెక్టర్ కీలక ఆదేశాలు**

**మైనర్లపై అకృత్యాలకు పాల్పడితే 'పోక్సో' కింద కఠిన చర్యలు**

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఫిబ్రవరి 18 : జిల్లాలోని చిన్నారులు, గర్భిణీ స్త్రీలు మరియు కిశోర బాలికల రక్షణ, ఆరోగ్యం విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి గారు ఆదేశించారు. బుధవారం ఐసీడీఎస్ బృందం మరియు సీడీపీఓ లతో నిర్వహించిన ప్రత్యేక వీడియో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భాల విషయంలో రాజీలేని 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో వన్ స్టాప్ సెంటర్ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 100% ఆధార్ నమోదు ఉండాలని, ప్రతి బిడ్డకు ఆధార్ ఉండాలనే లక్ష్యంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ వారంలో నిర్వహించిన 9 శిబిరాల ద్వారా 88 మంది చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి మరియు శిశువుకు అభా కార్డులు తప్పనిసరిగా జారీ చేయాలని, దీనివల్ల వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో సమర్థంగా పర్యవేక్షించ వచ్చని పేర్కొన్నారు. మైనర్ల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు మరియు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కేవలం పౌష్టికాహారం అందించడమే కాకుండా, స్థానిక బాలికలకు తోడుగా ఉంటూ వారి సమస్యలను వినే భరోసా కల్పించాలని సూచించారు. మనం కేవలం నిబంధనలను అమలు చేయడం లేదని, మన పిల్లల భవిష్యత్తును కాపాడుతున్నామనే సామాజిక



అవగాహన అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పీడీ ఐసీడీఎస్ డా. టి.కనకదుర్గ, సీడీపీఓలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ప్రభుత్వ శాఖ »A+' గ్రేడ్ సాధించడమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**

**మార్చి 15లోగా రోడ్ల పనులన్నీ పూర్తి కావాలి**

**వైద్య సేవల్లో చీఖూూ ప్రమాణాలు పాటించాలి**

**KPI సమీక్షలో జిల్లా అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం**

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఫిబ్రవరి 18 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు నిర్దేశిత కీలక పనితీరు సూచికల (ఖూ×ం)లో అత్యుత్తమ ఫలితాలు సాధించి, జిల్లాను ప్రగతిపథంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి గారు ఆదేశించారు. బుధవారం వివిధ శాఖల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ.. ప్రజలకు అందే సేవల్లో నాణ్యతను పెంచడం ద్వారా మాత్రమే ఉత్తమ గ్రేడింగ్ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'దీ' మరియు 'జ' గ్రేడ్లలో ఉన్న శాఖలు తక్షణమే లోపాలను సరిదిద్దుకుని 'ఙాం' గ్రేడ్ సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో డేటా నమోదులో జాప్యం ఉండకూడదని హెచ్చరించారు. జిల్లాలో రోడ్ల నిర్వహణ పనులు ఇప్పటికే 86% పూర్తయ్యాయని,



మిగిలిన పనులను మార్చి 15వ తేదీ గడువులోగా పూర్తి చేసి 100% లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 88% ప్రగతిని, రాబోయే జాబ్ మేళాల ద్వారా 95% కి పెంచాలని ఉపాధి కల్పన అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రులు జాతీయ నాణ్యత ప్రమాణాల (చీఖూూ) సర్టిఫికేషన్ పొందేలా మౌలిక వసతులు, సేవలలో మెరుగుదల ఉండాలని వైద్యులకు సూచించారు. పట్టణాల్లో చెత్త వేరు సేకరణ నూటికి నూరు శాతం అమలు చేయాలని, పచ్చదనం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ నెలాఖరులోగా అన్ని శాఖల డేటాను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, పనితీరులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ గారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి వ్యర్థాలను ప్రతిరోజూ తరలించాలి

**- వెటర్నరీ ఆసుపత్రులూ నిబంధనలను పాటించాలి**

**-- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ - ఎస్.రాంసుందర్ రెడ్డి**



ప్రజాస్వామ్యం / విజయనగరం:జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు, ఆసుపత్రులన్నీ బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత ఆసుపత్రులపై



చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి మరియు ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణా కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్ణీత సమయంలోగా తరలించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల కోడింగ్ బ్యాగులను ఉపయోగించి ఇంజక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న సుమారు 496 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పశుసంవర్ధక ఆసుపత్రుల నుంచి కూడా క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. సేకరించిన వ్యర్థాలను 48 గంటల గడువులోగా తరలించాలని, ఎక్కడా బయట కనిపించకూడదని స్పష్టం చేశారు. ప్రతీరోజూ వ్యర్థాల సేకరణ, అప్‌లోడ్, తరలింపు జరగాల్సిందేనని స్పష్టం చేశారు. అంతేకాక, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను 'బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్'లో ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే నోటీసులు జారీ చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ప్రతీ ఇంటి నుంచీ బయో మెడికల్ వ్యర్థాలను సైతం సేకరించి, సరైన పద్దతిలో వాటిని తరలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అలాగే వ్యర్థాలను బయట పడేసే ఆసుపత్రులపై నిఘా పెట్టాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిజిహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ ఎ.పద్మజ, ఇతర వైద్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దివిస్ లో మాక్ డ్రిల్ నిర్వహించిన భద్రతా విభాగం





ప్రజాస్వామ్యం భీమునిపట్నం,ఫార్మా కంపెనీలలో జరిగే ప్రమాదాల దృష్ట్యా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ, విశాఖపట్నం వి.సురేష్ దివిస్ లాబరేటరీస్ లిమిటెడ్, చిప్పాడ పరిశ్రమలో దివిస్ భద్రతా విభాగం నిర్వహించిన మాకుడ్రిల్, సేఫ్టీ కమిటీ మీటింగ్, ఇన్ స్పెక్షన్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు. భద్రతా విభాగం వారు నిర్వహించిన మాకుడ్రిల్ కార్యక్రమాన్ని ఉద్దేశించి డి.సి.ఐ.ఎఫ్ వి.సురేష్ మాట్లాడుతూ దివీస్ యాజమాన్యం టాక్సిక్ గ్యాస్ లీక్, ఎక్స్ప్లోసివ్ సాల్వెంట్ లీక్, ట్యాంక్ ఫామ్ ఫైర్ మరియు ఎక్స్ప్లోసన్ లాంటి అన్ని పెద్ద ప్రమాదాల మీద మాకు డ్రిల్ నిర్వహించిన విధానం చాలా ఉన్నతనమైనది గాను, ప్రతి ఎమర్జన్సీ టీమ్ మెంబర్ చాలా కాన్ఫిడెంట్ గా చెయ్యటమే కాకుండా సరియైన సమయంలో సరయైన సామాగ్రి మరియు అధునాతనమైన రక్షణ సామాగ్రి, ఉపయెగిస్తూ పాల్గొన్న విధానం ఎంతో ప్రశంసనీయమైనదని, ఎమర్జన్సీ పరికరాలు సమయానికి అన్నీ పని చేయడం ముఖ్యం గా ప్రతి ఉద్యోగి ఎంతో నిబద్ధతతో ఉత్తేజం కలిగి ఉన్నారని అన్నారు. రసాయన పరిశ్రమ లో పెద్ద ప్రమాదాలు అనుకున్న అన్నిటి మీద ఒకేసారి మాక్ డ్రిల్ చేయటమే కాక అత్యద్భుతంగా చేయటం అంటే సామానమైన విషయం కాదన్నారు. తదుపరి పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి.రమణ ఎమర్జన్సీ టీం మెంబర్స్ అందరికి పేరు పేరునా అభినందనలు తెలుపుతూ, టీమ్ మెంబర్స్, లీడర్స్ ని అందరిని ప్రశంసించారు. భవిష్యత్తు లో ఎప్పుడైనా ఇలాంటి నిబద్ధత తో నే పనిచేయాలని కోరారు. భద్రతా కమిటీ చైర్మన్, సెక్రటరీ ఎల్ వి రమణ, ఎం. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేఫ్టీ కమిటీ మీటింగ్ లో పాల్గొని వారు స్పందిస్తున్న విధానాన్ని, ఉద్యోగుల యెక్క నిబద్ధత ను కొనియాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు దివిస్ సిబ్బంది స్పందించిన తీరు, ప్రథమ చికిత్స చేసిన విధానం, ఎమర్జెన్సీ ఐటమ్ వాటి పనితీరుపై భద్రతా సిబ్బందిని అభినందించారు. అనంతరం భద్రత విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమర్జన్సీ టీం మెంబర్స్ మరియు సిబ్బంది తో ఎలాంటి ఎమర్జన్సీ అయినా సరైనసమయంలో స్పందించి, ఆ ప్రదేశాన్ని దాటకుండానే కంట్రోల్చెయ్యగలమని ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో ఏ జి యమ్ ఐ ఎల్ ప్రసాద్, పర్సనల్ ఏజీయం పి. శ్రీనివాసరావు, కేశవరావు, గోపీకృష్ణ, తదితర భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# తర్లువాడ సర్పంచ్ బి ఆర్ బి నాయుడు దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు



ప్రజాస్వామ్యం ఆనందపురం మండలం తర్లువాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ బి ఆర్ బి నాయుడు దంపతులకు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కలిసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు పిమ్మట నాయకులు అభిమానులు మధ్య దంపతులు ఇద్దరు కేకు కట్ చేశారు అందరు వారికి పెళ్ళిరోజు శుభాకాంక్షలు తెలిపారు. వీరి దాంపత్య జీవితం మధురంగా ఉండాలని ఆకాంక్షించారు.పంచాయితీ అభివృద్ధి కి ప్రజలు క్షేమం కోసం అహర్నిశలు శ్రమించే గొప్ప నాయకుడు అని కొనియాడారు ఇలాంటి నాయకుడు తో పాటు పని చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది అని,అందరు బాగుండాలి అని కోరుకునే మా సర్పంచ్ వెంటే మా రాజకీయ పయనం అని ఆయన అబిమానులు ముక్త కంఠంతో ఆయనపై ఎనలేని అభిమానం చూపించారు అలాగే గతంలో ఎంపీటీసీగా ప్రస్తుతం సర్పంచ్ గా భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని అందరు ముక్తకంఠంతో కోరారు. స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అభిమానులు కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు పి మ్మట సర్పంచ్ బి ఆర్ బి నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశీస్సులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నానని భవిష్యత్తులో మంచి అవకాశం వస్తే మండల అభివృద్ధికి కూడా ముందుంటానని మీరందరూ ఇచ్చిన తోడ్పాటు నాకు మరింత బాధ్యత లు పెరిగేలా చేసాయని బి ఆర్ బి నాయుడు అందరికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమం లో తర్లువాడ పంచాయతీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాస్వామ్యం భీమునిపట్నం, 11కేవి దాకమర్రి రూరల్ ఫీడర్ లైన్ మీద మరమత్తులు, జంపరింగ్ వర్క్ మరియు చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం అనగా 20 వతేది ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్, బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ కారణం గా టీ. నగర పాలెం, కనకాలపేట, మజ్జివలస, లక్ష్మీపురం, సింగన్నబంద, విజయరామపురం, కృష్ణ రాజుపేట, మద్దిపేట మరియు నారాయణరాజుపేట లలోగల గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయము కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

# సెక్యూరిటీ ఎనలిస్ట్ కోర్స్ కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాస్వామ్యం భీమునిపట్నం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్ భీమునిపట్నంలో (కంప్యూటర్ )సెక్యూరిటీ ఎనాలిస్ట్ కోర్స్ కు సంబంధించి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎస్. అన్నపూర్ణ ఒక ప్రకటన లో తెలియచేసారు. ఈ కోర్సుకు 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, డిగ్రీ లేదా డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియచేసారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్, ఎస్. అన్నపూర్ణ ను 9014758949 నంబర్ లో సంప్రదించాలని కోరారు.

# నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు విద్యా సామాగ్రి పంపిణీ



ప్రజాస్వామ్యం తగరపువలస, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నన్హి కలి ప్రాజెక్ట్ ద్వారా డా. బి.ఆర్. అంబేద్కర్ జి.వి.యం.సి ఉన్నత పాఠశాల చిట్టివలస లోని 105 మంది విద్యార్థినిలకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, టిషర్టులు, షూ, శానిటరీ పాడ్స్ తదితర విద్యా సంబంధిత మరియు ఆరోగ్య సంబంధిత సామాగ్రిని ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథ స్వామి సమక్షంలో అందించారు. అదేవిధంగా ఆటల్లో బాగా రాణించిన విద్యార్థినిలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు కూడా అందించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు కొప్పల తేజశ్వరి, ఆర్.మహేశ్వరి, ఆర్. పల్లవి, కోమలి, ఆరాధ్య, పౌర్ణమి విద్యార్థినిలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఆడపిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ నాంది ఫౌండేషన్ చక్కటి పునాది వేసిందని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ఉపాధ్యాయుల సహకారంతో ఈ కార్యక్రమం చక్కగా నడుస్తుందని ప్రాజెక్ట్ ప్రతినిధి గంటా దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యవతి ఉపాధ్యాయులు జగదీష్, సత్యలక్ష్మి, సూర్య మహేశ్వరరావు, విశ్వేశ్వరరావు, ప్రమీల, సునీత, రాంబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పసిడి జోరుకు బ్రేక్..భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు..! తులం గోల్డ్ రేటు ఎంతంటే?

భారత మార్కెట్లో ఈ రోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో పరిశీలించినట్టయితే.. 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర 10 గ్రాములు రూ.1,54,190లకు చేరింది. అదే, ఆర్నమెంట్స్ కోసం ఉపయోగించే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు 1,41,340ల వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,15,640లుగా ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఇవాళ్టి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..-- చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,55,230 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,42,290 గా ఉంది.-- ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.-- ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,340 క్యారెట్ల ధర రూ.1,41,490 గా ఉంది.-- కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.-- బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.-- హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.-- విజయవాడలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.-- విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 గా ఉంది.ఇక్కడ పేర్కొన్న బంగారం ధరలు ఉదయం 8 గంటలలోపు అందిన సమాచారం మేరకు మాత్రమే. ధరలు ప్రతి క్షణం మారవచ్చు.ఇక వెండి విషయానికి వస్తే..ఇవాళ్ల వెండి ధర గ్రాము రూ. 259.90లు ఉండగా, కిలో వెండి ధర రూ. 2,59,900లు పలుకుతోంది. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

గురువారం, ఫిబ్రవరి 19 ,2026




# నిర్మాతగా సమంత

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా స్టార్ స్టేటస్ పొందిన హీరోహీరోయిన్లు తక్కువే అని చెప్పాలి. ఆ జాబితాలో ముందువరుసలో ఉంటుంది చెన్నై సోయగం సమంత . తెలుగు, తమిళం, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో నటిస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సామ్.. ఇప్పుడు ప్రొఫెషనల్‌గా మరో ముందడుగు వేసింది. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా స్టార్ స్టేటస్ పొందిన హీరోహీరోయిన్లు తక్కువే అని చెప్పాలి. ఆ జాబితాలో ముందువరుసలో ఉంటుంది చెన్నై సోయగం సమంత (%ఝుఝుఱ్ట్రుఝు%). ఏ మాయ చేశావే సినిమాతో కుర్రకారులో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సామ్.. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. ఆయా భాషల్లో స్టార్ హీరోలతో నటిస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సామ్.. ఇప్పుడు ప్రొఫెషనల్‌గా మరో ముందడుగు వేసింది. ఇప్పటివరకు సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన సామ్ ఇక నుంచి తనలోని నిర్మాతను కూడా అందరికీ పరిచయం చేసేందుకు రెడీ అయింది. సామ్ పేరుతో హెూం ప్రొడక్షన్ హౌస్‌ను స్థాపించింది. ఇదే విషయాన్ని ప్రకటిస్తూ ఓ వీడియో షేర్ చేసింది. నా ప్రొడక్షన్ హౌస్‌ని ప్రకటించినందుకు సంతోషిస్తున్నా. సామాజిక అంశాలు, వాటి సంక్లిష్టత గురించి మాట్లాడే కథలను ఆహ్వానించే, వాటిని ప్రోత్సహించే ప్లాట్‌ఫాం ఇది. చిత్రనిర్మాతలు అర్థవంతమైన, ప్రామాణికమైన, విశ్వవ్యాప్తమైన కథలను చెప్పడానికి ఒక వేదిక. కొత్త తరం ఆలోచనలు, భావోద్వేగాలను ప్రతిబింబించే కంటెంట్‌ను అందించడమే ఉద్దేశం. నాకు ఇష్టమైన పాటల్లో ఒకదాని నుండి ప్రేరణ పొందిన.. బ్రౌన్ గర్ల్ ఇప్పుడు పోటీలో ఉంది.. అంటూ క్యాప్షన్ ఇచ్చింది సామ్. సామ్ ప్రస్తుతం బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్‌తో కలిసి సిటడెల్ వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. మరోవైపు అమెరికన్ ఫిల్మ్ చెన్నై స్టోరీస్‌లో కూడా నటిస్తోంది.

# 90 కాస్ట్యూమ్స్‌లో

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. స్వీయ దర్శకనిర్మాణంలో అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. పీరియాడిక్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ చిత్రంలో కల్యాణ్‌రామ్ సీక్రెట్ బ్రిటీష్ ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. గూఢచారి పాత్రలో ఆయన నటించడం ఇదే తొలిసారి. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ 90 రకాల కాస్ట్యూమ్స్‌తో కనిపిస్తారని డిజైనర్ రాజేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ వివరించగానే హీరో లుక్స్ డిఫరెంట్‌గా ఉండాలని అర్థమైంది. ఇందులో హీరో భారతీయుడు. అయినా బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా పనిచేస్తుంటాడు. ఆయన పాత్రను ఎలివేట్ చేసేలా కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాను. కొన్ని దుస్తుల్లో అచ్చమైన భారతీయత కనిపిస్తుంది' అని తెలిపారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: శ్రీకాంత్ విస్సా, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.



ఆ రోజుల్లో ఎన్టీఆర్, కృష్ణ సినిమాలు నెలకు ఒకటి చొప్పున విడుదలయ్యేవి. ఆమాటకొస్తే నెలకు రెండుమూడు సినిమాలు విడుదలైన దాఖలాలు కూడా ఉన్నాయి. చిరంజీవి, బాలకృష్ణ కూడా ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసేవాళ్లు. ఇప్పటి హీరోలు ఏడాదికి ఒక సినిమా చేయటమే గొప్ప. అయితే హీరో నానిని మాత్రం అందులో మినహాయించాలి. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టిన నాని 'అష్టాచెమ్మా'తో హీరోగా మారి 15ఏళ్లు. ఈ పిరియడ్‌లో 30కి పైగా సినిమాల్లో హీరోగా చేసేశాడు.

అంటే రమారమి ఏడాదికి రెండు సినిమాల చొప్పున చేశాడన్నమాట. ఈ విషయంలో నానిని ఎవరైనా అభినందించాల్సిందే. ఈ స్పీడ్‌ని నేటికీ నాని కొనసాగిస్తూనేవున్నాడు. ఉదాహరణకు నాని నటించిన 'హాయ్ నాన్న' ఈ మధ్యే విడుదలైంది. ఆ సినిమా వేడి చల్లారకముందే తను నటిస్తున్న 'సరిపోదా శనివారం' సినిమా కూడా విడుదలకు రెడీ అయ్యిందని సమాచారం. వచ్చే నెలలోనే ఈ సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. నానితో 'అంటే సుందరానికి' లాంటి ఫీల్‌గుడ్ మూవీని తీసిన వివేక్ ఆత్రేయ దర్శకుడు కావడంతో సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. జేక్స్ బెజాయ్ సంగీత దర్శకుడు. ఏదేమైనా.. సినిమాలు వేగంగా చేస్తూ, ఎంతోమంది సినీ కార్మికులకు పని కల్పిస్తున్న నానీని నిజంగా మెచ్చుకోవాల్సిందే.



# వచ్చే నెలలో కొత్త హంగామా




# సలార్ రన్‌టైం ఎంతో తెలుసా..?

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ అభిమానులు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న సినిమా సలార్ . యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా రానుండగా.. డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటీవలే ట్రైలర్‌ను కూడా విడుదల చేయగా.. నెట్టింట వ్యూస్ పంట పండిస్తోంది. కాగా సలార్ రన్‌టైంకు సంబంధించిన వార్త ఇప్పుడు ఫిలింనగనర్ సర్కిల్ లో హల్ చల్ చేస్తోంది. సలార్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సలార్ కి సీబీఎఫ్‌సీ ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సలార్ రన్ టైం 2 గంటల 55 నిమిషాల 22 సెకన్లు. యాక్షన్ డ్రామా కావడం, లెంగ్తీ రన్ టైం ఉండటం.. సినిమాపై హైప్ మరింత క్రియేట్ చేస్తోంది. కేజీఎఫ్, కాంతార సినిమాలకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, మ్యూజిక్ అందించిన రవి బస్రూర్ ఈ సినిమాకు పనిచేస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. సలార్‌లో మాలీవుడ్ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటిస్తోంది. వరదరాజ మన్నార్ ది కింగ్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సలార్‌ను కేరళలో పృథ్వీరాజ్ సుకుమారన్ హెూం బ్యానర్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ హౌజ్ విడుదల చేయనుండగా.. నైజాంలో టాలీవుడ్ పాపులర్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సలార్‌ను విడుదల చేస్తుంది. అనిల్ తడని నార్తిండియాలో ఈ సినిమాను విడుదల చేయనుండగా.. ఓవర్సీస్‌లో సలార్‌ను విడుదల చేస్తుంది.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022